క్లుప్తంగా

మా ఓటు అమ్ముకోం

- ప్లకార్డులతో యువత నినాదాలు



మా ఓటు అమ్ముకోమంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువత

మల్కాపురం: ఓటు చాలా అమూల్యమైనది.. దాని విలువ తెలిసిన వారు ఉత్తములైన వారిని ఎన్నుకుంటారు. ఓటు విలువ తెలియన వారు దాన్ని అమ్ముకుని దేశం వెనకబాటుకు కారకుల వుతారని సామాజిక సేవా కార్యకర్త రాజు అన్నారు. 61వ వార్డు ప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన రాజు తన మిత్రులతో కలిసి మా ఓటు అమ్ముకోం అంటూ ప్లకార్డులు పట్టుకుని మల్కాపురం నుంచి శ్రీహరిపురం వరకు శుక్రవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. దేశంలో శాంతియుత పాలన సాగాలంటే ఉత్తములైన వారిని ఎన్నుకుందామన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



కార్యక్రమంలో పాల్గొన్న అనసూయాదేవి

మల్కాపురం: చిన్నారులకు ఆరోగ్యవంతమైన జీవితం అందించడంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం అధికారి అనసూయాదేవి సూచించారు. నిత్యం వారి యోగ క్షేమాలు తెలుసుకుంటూ పౌష్టికాహారం అందిస్తే మంచి యువతగా ఎదుగుతారని చెప్పారు. 60వ వార్డు ఇందిరాకాలనీలో ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంప్‌లో భాగంగా శుక్రవారం చిన్నారుల తల్లి దండ్రులతో మాట్లాడారు. మంచి ఆహారంతో పాటు విద్య అందించే విధంగా ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్లాలని తల్లిదండ్రులకు సూచించారు. సెల్‌ఫోన్లు, వీడియో గేమ్‌లకు దూరంగా ఉంచాలన్నారు.

నేటి నుంచి అయ్యప్ప స్వామి జయంత్యుత్సవాలు



అక్కిరెడ్డిపాలెం: అయ్యప్పస్వామి జయంత్యుత్సవాలను షీలానగర్‌లోని స్వామి వారి ఆలయంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీ మణికంఠ జ్యోతి సేవా సంఘం ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో విద్యార్థులకు శనివారం చిత్రలేఖన పోటీలను, ఆదివారం వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు తెలియజేశారు. మూడు రోజుల పాటు ఆలయంలో విశేష పూజలు ఉంటాయన్నారు.

కో-ఆపరేటివ్ సభ్యుల షేర్ క్యాపిటల్‌పై 6 శాతం వడ్డీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కో–ఆపరేటివ్ స్టోర్స్ సభ్యుల షేర్ క్యాపిటల్‌పై 6 శాతం వడ్డీ ఇవ్వనున్నామని కో–ఆపరేటివ్ స్టోర్స్ పాలకవర్గం ప్రకటించింది. స్టీల్‌క్లబ్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన కో–ఆపరేటివ్ స్టోర్స్ 57వ మహాజన సభలో అధ్యక్షుడు బి.టి. జగదీశ్వరరావు మాట్లాడారు.

స్టోర్స్ ప్రస్తుతం 14,283 సభ్యులతో రూ.కోటి 22 లక్షల మూలధనం కలిగి నెలకు రూ.7 కోట్లు వ్యాపారం చేస్తోందన్నారు. ఉక్కునగరం పాఠశాలల్లో యూనిఫాం, నోట్ బుక్స్ అమ్మకాలు చేయడానికి ఆయా పాఠశాలల యాజమాన్యాలు అంగీకరించాయని తెలిపారు. సమావేశంలో కార్యదర్శి జి.నాగభూషణం, ఉపాధ్యక్షులు ఆకుల నూకరాజు, కోశాధికారి పి.రామకృష్ణారావు, డైరెక్టర్లు ఎ.వి.ఎస్.సత్యనారాయణ, డి.వి.నాగబాబు, ఇ. లోకేష్, ఎస్.భాను, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్..జిగేల్



గ్రీన్‌బెల్ట్ పార్కులో వాకింగ్ ట్రాక్

- గ్రీన్‌బెల్ట్‌కు ఆధునిక లైటింగ్
- వ్యాయామానికి అనరమైన ఏర్పాట్లు
- పార్కుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు
- ఓపెన్ జిమ్‌లకు క్యూ కడుతున్న జనం

విశాఖ విద్య: హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్‌ను ప్రభుత్వం ఆహ్లాదకరంగా తీర్చిదిద్దింది. రాత్రి వేళ జిగేల్ మనేలా విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసింది. ఓపెన్ జిమ్‌లు.. పిల్లలకు ఆట పరికరాలు వంటి వసతులు కల్పించడంతో ప్రజలు క్యూ కడుతున్నారు. దీంతో మొన్నటి వరకూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఉన్న గ్రీన్ బెల్ట్ నేడు ఆహ్లాదానికి కేరాఫ్‌గా మారింది.

కాంతులు.. అదనపు హంగులు

విశాఖ నగరానికి ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ మీదగా వచ్చే వారికి గ్రీన్ బెల్ట్ పార్కులు స్వాగతం పలుకుతున్నాయి. 52వ వార్డు పరిధిలోని గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని నగరపాలక సంస్థ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. మర్రిపాలెం వుడా లే అవుట్ గ్రీన్ బెల్ట్‌లో 'వనిత వాకర్స్' పేరిట మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. విశాఖ నగరంలో ఇదో రోల్ మోడల్‌గా నిలువనుంది.

పట్టించుకోని గత ప్రభుత్వం

హైవేపై ప్రయాణించే వారు రోడ్డు పక్కన ఆగాలంటే ఒకప్పుడు భయాందోళనకు గురయ్యే పరిస్థితులు ఉండేవి. ఆ ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు సైతం జరిగేవి. వీటిని అభివృద్ధి చేయాలని వార్డు పరిధిలోని కాలనీ వాసులు మొర పెట్టుకున్నా.. టీడీపీ ప్రభుత్వంలో నాటి ప్రజాప్రతినిధులు పెద్దగా పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు మౌలిక సౌకర్యాలు పెంపొందించాలనే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా జీవీఎంసీ ద్వారా అభివృద్ధి పనులు చేశారు.

వ్యాయామానికి వీలుగా..

మర్రిపాలెం వుడా లే అవుట్ వద్ద అభివృద్ధి చేసిన గ్రీన్ బెల్ట్ వ్యాయామశాలగా మారింది. వాకింగ్ ట్రాక్‌లతో పాటు, వివిధ రకాల వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయటంతో ఉదయం, సాయంత్రం జనసంచారంతో సందడిగా మారుతోంది. వీరికి సౌకర్యవంతంగా ఉండేలా లైటింగ్ ఏర్పాటు చేశారు.



పార్కులో వ్యాయామం చేస్తున్న మహిళలు



పార్కులో కూర్చొనేందుకు ఏర్పాటు చేసిన బెంచీలు



గ్రీన్‌బెల్ట్ పార్కుకు ఏర్పాటు చేసిన లైటింగ్

ఎంతో ఉపయోగం



మర్రిపాలెం వుడా లే అవుట్ వాసులకు సౌకర్యవంతంగా ఉండేలా పార్కులు అభివృద్ధి చేశారు. వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరినా గతంలో ఎవరూ పట్టించుకోలేదు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్ల పార్కులో అన్ని రకాల సౌకర్యాలు సమకూరాయి.

కె. నాగేశ్వరరావు,
వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు, మర్రిపాలెం

పనులన్నీ పూర్తి చేస్తాం



అందరికీ ఉపయోగకరంగా ఉండేలా పార్కులతో పాటు గ్రీన్‌బెల్ట్‌లను అభివృద్ధి చేస్తున్నాం. రాత్రి వేళల్లో కూడా ఉపయోగపడేలా ఎల్ ఈడీ లైట్లు ఏర్పాటు చేశాం. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఉన్నతాధికారుల సూచనలకు అనుగుణంగా పనులు పూర్తి చేసేందుకు దృష్టి సారించాం.

– ఏడుకొండలు,
డిప్యూటీ ఇంజినీర్, జీవీఎంసీ జోన్–5

రోడ్డు విస్తరణ బాధితులకు అండగా ఉంటా..



ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న లక్ష్మీనగర్ వాసులు

గోపాలపట్నం: లక్ష్మీనగర్ రహదారి విస్తరణలో ఇళ్ల స్థలాలు కోల్పోతున్న వారికి అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ భరోసా ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో లక్ష్మీనగర్ ప్రాంత రహదారి విస్తరణ బాధితులు ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. 80 అడుగుల రహదారిగా కాకుండా 40 అడుగులకు కుదించే విధంగా చేయాలని కోరారు. ఇల్లు కోల్పోయిన వారికి నష్ట పరిహారం ఇంటి స్థలానికి గానూ టీడీఆర్ నాలుగు రెట్లు ఉండేలా చూడాలన్నారు. కొంత మేర కోల్పోయిన వారికి ఇంటి పునర్నిర్మాణానికి దేవస్థానం అధికారుల ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన ఆనంద్‌కుమార్ స్థానికంగా ఉన్న నిర్వాసితుల పరిస్థితులపై అవగాహన ఉందని, తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బండి దుర్గేష్, తెలుకుల రమేష్, మహేశ్వరరావు, ఐ.శ్రీనివాస్, కె.రాజు, డి.వెంకట్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ కార్యకర్తలు



పార్టీలోకి స్వాగతిస్తున్న ఆనంద్‌కుమార్



పార్టీలో చేరిన వారితో యలమంచిలి మున్సిపాలిటీ చైర్ పర్సన్ రమాకుమారి తదితరులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు కుంచాలమ్మ కాలనీ ప్రాంతానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. 59వ వార్డు నక్కవానిపాలెంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి సమక్షంలో పార్టీలో చేరిన వారితో ఆనంద్‌కుమార్ కొద్ది సేపు మాట్లాడారు. టీడీపీలో కష్టపడి పని చేసినా గుర్తింపు లేకపోవడంతో వైఎస్సార్‌సీపీలో చేరినట్టు మహిళలు చెప్పారు. కార్యక్రమంలో, యలమంచిలి మున్సిపాలిటీ చైర్ పర్సన్ పిళ్లా రమాకుమారి, కార్పొరేటర్ లావణ్య ,నాయకులు కన్నబాబు,పత్నిరావు పాల్గొన్నారు.

'పశ్చిమ'ను అగ్రస్థానంలో నిలపడమే ధ్యేయం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్



63వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

సింధియా: గత పాలకుల తీరుతో మరుగున పడిన పశ్చిమ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నంబర్ వన్‌గా నిలబెట్టడమే ధ్యేయంగా తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ తెలిపారు. 63వ వార్డు కాకరలోవ, చింతల్లోవ ప్రాంతాల్లో పార్టీ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు ఆయన వెళ్లి ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయనకు మహిళలు పూల వర్షం, మంగళ హారతులతో నీరాజనాలు పలుకుతూ ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్య అతిథులు 3 జిల్లాల వైఎస్సార్ టీయూసీ జోనల్ ఇన్‌చార్జి కలిదిండి బద్రీనాథ్, యలమంచిలి మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమణకుమారి ఆడారితో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో 175 స్థానాలనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే గెలిచి దేశంలో చరిత్ర సృష్టించనున్నారన్నారు. ఈ ఎన్నికల్లో స్టార్ క్యాంపైనర్లు పేదలేనని, పశ్చిమను మోడల్ నియోజకవర్గంగా చూడటమే తన కలని పేర్కొన్నారు. పేద ప్రజలకు సేవచేసే భాగ్యాన్ని ఇవ్వాలని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు సోమాదుల సురేష్, జేసీఎస్ కన్వీనర్ నాగభూషణం, గల్లా శ్రీను, మళ్ల ధనలత, రాష్ట్ర వైఎస్సార్ టీయూసీ కార్యదర్శి సంతోష్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

'స్పందన' కొనసాగించాలని వినతి

సింధియా: ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా నిలిపివేసిన స్పందన కార్యక్రమాన్ని కొనసాగించాలని, నిబంధనలకు లోబడి పేద ప్రజల సమస్యలు పరిష్కరించాలని జై భీమ్ యూత్ ఉపాధ్యక్షుడు ములకలపల్లి ప్రకాష్ శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఎన్నికల కోడ్ 3 నెలలు ఉంటుందని, అంతవరకు స్పందన కార్యక్రమాన్ని నిలిపివేయడం వల్ల పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. అలాగే కుల, ఆదాయ ధ్రువపత్రాలు జారీ చేయాలని కోరారు.

సమష్టి కృషితో విజయం సాధిద్దాం



మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి అంతా కలిసికట్టుగా పనిచేయాలని పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. 59వ వార్డు పరిధిలోని 13 బూత్‌ల నాయకులు, గృహసారథులు, బూత్ కన్వీనర్లతో శుక్రవారం నక్కవానిపాలెంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ఇంకా సమయముందని నిర్లక్ష్యంగా ఉండకుండా.. డోర్ టూ డోర్ ప్రతి ఒక్కరూ వెళ్లి పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, వాటి వల్ల పొందిన లబ్ధిని వివరించాలన్నారు. ఆయన మళ్లీ సీఎం అయితే చేపట్టబోవు సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నా.. తాను పశ్చిమలో ఎమ్మెల్యేగా గెలుపొందాలన్నా అందరి సమష్టి కృషితోనే సాధ్యమవుతుందన్నారు. పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని కోరారు. పార్టీని నమ్ముకుని పనిచేసే కార్యకర్తలకు తప్పక గుర్తింపు ఉంటుందని, మన నాయకులపై చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టేలా ప్రతి కార్యకర్త ఉండాలని ఆనంద్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, పుర్రె అప్పారావు యాదవ్, ఎం.పెంటారావు, గాలి సన్యాసిరావు, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

'వీరుల త్యాగం.. వృథా కానివ్వం'



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: 'విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు' నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. నాటి వీరుల త్యాగాన్ని వృథా కానివ్వమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1135వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం ఎందరో మహనీయులు ప్రాణాలను సైతం ధారపోశారన్నారు.

ఎంతోమంది భూములను ధారాదత్తం చేశారన్నారు. నాటి త్యాగధనుల స్ఫూర్తితో, చెదరని సంకల్పంతో ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని ప్రధాని మోదీ ప్రకటించేవరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

61వ వార్డులో జోరుగా ప్రచారాలు



మల్కాపురంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న భోగవల్లి నాగభూషణం



ఇండస్ట్రియల్ కాలనీలో ప్రచారం చేస్తున్న గృహసారథులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కన్వీనర్లు జోరుగా ఎన్నికల ప్రచారాలు నిర్వహించారు. నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో పేదలకు జరిగిన మేలును ఇంటింటా వివరించారు. వైఎస్ జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే చేపట్టబోవు సంక్షేమ కార్యక్రమాలను తెలియజేశారు. మల్కాపురంలో స్థానికులకు జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం సంక్షేమ పథకాల వల్ల ప్రజలు పొందిన లబ్ధి తదితర అంశాలను వివరించారు.

- ప్రకాష్‌నగర్, ఇండస్ట్రియల్ కాలనీలో లాయర్ రాజు, దాసరి రవి తదితరులు వేరు వేరుగా పాల్గొని ప్రభుత్వ పథకాల వల్ల పేదలు ఎంతో సంతృప్తిగా ఉన్నారని, తెలియజేశారు.

'పశ్చిమ' ఆర్వో కార్యాలయం సిద్ధం

ఎన్నికల ఏర్పాట్లలో యంత్రాంగం



జ్ఞానాపురంలో ఏర్పాటు చేసిన ఆర్‌వో కార్యాలయం

కంచరపాలెం. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో అధికారులు సంబంధిత ఏర్పాట్లు పూర్తి చేశారు. విశాఖ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల ప్రక్రియకు వీలుగా జ్ఞానాపురంలోని జోన్–5 జోనల్ కార్యాలయాలను సిద్ధం చేశారు. ఇంజినీరింగ్, బర్త్ అండ్ డెత్ కార్యాలయాలకు సుమారు రూ.7లక్షలతో మరమ్మతులు చేపట్టారు. పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్‌వో) కార్యాలయం నిర్వహణకు వీలుగా ఆధునికీకరించారు. ఎన్నికల సిబ్బంది, వీడియో మానటరింగ్‌కు ప్రత్యేక గదులు కేటాయించారు. ఆయా రాజకీయ పార్టీలు, పోలింగ్ ఆఫీసర్లతో సమావేశాలు నిర్వహించేందుకు వీలుగా హాలును సిదధం చేశారు. నియోజకవర్గానికి సంబంధించి పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్‌వో) హుస్సేన్ సాహెబ్ నేతృత్వంలో ఇక్కడి నుంచే స్వీకరించనున్నారు.

సొసైటీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా..

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ హామీ



ఆడారి ఆనంద్‌కుమార్‌కు సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న సొసైటీ అధ్యక్షుడు రమణ

మల్కాపురం: సొసైటీ మనుగడకు ముప్పు రాకుండా చూసుకుంటూ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని హెచ్‌పీసీఎల్ యాజమాన్యంపై ఒత్తిడి తెస్తానని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ హామీ ఇచ్చారు. హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ) సంస్థలో హెచ్‌పీసీఎల్ కో–ఆపరేటివ్ సొసైటీ పేరిట సుమారు 160 మంది కార్మికులు 50 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. వీరికి సంస్థ యాజమాన్యం కనీస మౌలిక వసతులు కల్పించటం లేదు. కార్మికులను చులకనగా చూడటమే కాకుండా.. ఎదురు తిరిగిన వారిని విధుల నుంచి తొలగించడం, తాత్కాలికంగా నిలిపివేయడం వంటి చర్యలు చేపడుతోంది. ఈ సమస్యలపై 58వ వార్డు పిలకవానిపాలెంలోని ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సొసైటీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్‌కు సొసైటీ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. దీనిపై ఆయన స్పందిస్తూ సంస్థ ఏర్పాటు కోసం స్థానికంగా భూములిచ్చిన వారిపై యాజమాన్యం ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. తొలి నుంచి హెచ్‌పీసీఎల్ యాజమాన్యం కార్మిక సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణితో ఉందని, వారి ఆటలు ఇక సాగవన్నారు. యాజమాన్యం తీరుపై త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, కేంద్ర పెట్రోలియం మంత్రికి వివరించి సొసైటీ కార్మికులు, వారి కుటుంబాలు సంతోషంగా ఉండేలా చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వి.రమణ, ఎస్.పైడిరాజు, కోశాధికారి వై.ఎ.భాను, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ధ్వజావహరోహణం చేశారు. అంతకు ముందు ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ స్వామి, హరి నారాయణ స్వామి నేతృత్వంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి వేకువజామున ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామికి చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన పుష్పయాగం, ఊంజల్ సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఐ శ్రీనివాసరావు

ఉక్కునగరం: రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ సీఐ వి. శ్రీనివాసరావు సూచించారు. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన స్టీల్‌ప్లాంట్ పరిధిలోని పలు కూడళ్ల వద్ద సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు అత్యంత చాకచక్యంగా ఇతరుల అకౌంట్ల నుంచి నగదును దోచుకుంటున్నారన్నారు. ప్రతీ రోజు కోట్లాది రూపాయలు సైబర్ నేరగాళ్ల జేబులోకి వెళ్తున్నాయన్నారు. సుమారు 20 రకాల ఆన్‌లైన్ దొంగతనాలు జరుగుతున్నాయని వివరించారు. తెలియని యాప్‌లు, లింక్‌లను క్లిక్ చేయరాదని తెలిపారు. అనుమానం వచ్చిన ఫోన్ నంబర్లను ఎత్తవద్దని చెప్పారు. తెలియని వ్యక్తులకు ఆధార్ నంబర్లు, ఓటీపీలు, ఏటీఎం పిన్, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు వివరాలు తెలపరాదన్నారు. రివార్డులను ఆశగా చూపేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానం ఉన్న వ్యాపార లింక్‌లను తెరువరాదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.